వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మనసేత్రం
Follow
8 PM
ఆదివారం, డిసెంబర్ 3, 2023

Election Special Edition



## తదుపరి కార్యాచరణపై అధిష్ఠానానిదే నిర్ణయం: డీకే



హైదరాబాద్: సీనియర్ నేత, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడారు. తదుపరి కార్యాచరణపై పార్టీ అధినాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.





# తెలంగాణ గడ్డ.... కాంగ్రెస్ అడ్డ

### కామారెడ్డిలో కేసీఆర్ ఓటమి.. గజ్వేల్‌లో భారీగా తగ్గిన మార్జిన్

### తొమ్మిది మంది వలస నేతలు ఔట్.. పలుగురు మంత్రులు ఓటమి

### ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ స్వీప్.. సీపీఎం, బీఎస్పీ ప్రభావం నిల్

*తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. రాష్ట్రం ఇచ్చిన పార్టీగా దాదాపు పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చింది. 63 స్థానాల్లో సంపూర్ణ మెజార్టీతో అధికారాన్ని కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ 41 స్థానాలకు పరిమితం అయింది. బీజేపీ ఎనిమిది స్థానాల్లో, ఎమ్ఐఎమ్ ఏడు స్థానాల్లో గెలుపు బావుటా ఎగురవేశాయి. అంతేకాదు.. బీఆర్ఎస్‌లో దాదాపు ఆరుగురు మంత్రులు ఓటమి చెందగా.. కాంగ్రెస్ అగ్ర నేతలంతా విక్టరీ సాధించారు. కాంగ్రెస్ విజయం అమరవీరులకు అంకితం చేస్తామన్నారు. వాళ్ల ఆకాంక్షలను నెరవేర్చుతామన్నారు. పేదల బతుకులు బాగుపడేందుకు కాంగ్రెస్ పనిచేస్తుందన్నారు. ప్రతిపక్షాల సలహాలు, సూచనలు స్వీకరించి కాంగ్రెస్ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తుందన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు విలక్షణమైన తీర్పు ఇవ్వడం సంతోషకరమన్నారు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి ప్రజల జీవితాలను బాగు చేస్తామన్నారు. కాంగ్రెస్ గెలుపులో ప్రజలు, 30 లక్షల మంది నిరుద్యోగులు, సీపీఐ, జనసమితి పార్టీలు మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.*

| తెలంగాణ 119/60 | |
|---|---|
| పార్టీ | గెలుపు |
| బిఆర్ఎస్ | 39 |
| కాంగ్రెస్ | 64 |
| బిజెపి | 8 |
| ఎంఐఎం | 7 |
| ఇతరులు | 1 |

## ప్రగతి భవన్ కాదు.. ఇక ప్రజా భవన్: రేవంత్ రెడ్డి

ఈ గెలుపు తెలంగాణ ప్రజలది.. కాంగ్రెస్‌కు విజయం అందించిన అందరికీ ధన్యవాదాలు అని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం దిశగా దూసుకుపోతున్న నేపథ్యంలో రేవంత్ రెడ్డి ఇవాళ గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలు ఇవాళ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించారని.. ఈ తీర్పు ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నేరవేర్చేందుకు కాంగ్రెస్‌కు అవకాశం వచ్చిందన్నారు. తెలంగాణ ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారని.. డిసెంబర్ 3 2023 చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం శ్రీకాంత్ చారి డిసెంబర్ 3వ తేదీన అమరడయ్యాడని.. ఇదే రోజు కాంగ్రెస్ సాధించిన ఈ విజయం అమరులకు అంకితం ఇస్తున్నామన్నారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటులో బీఆర్ఎస్ సహకరిస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. ఇక సచివాలయం గేట్లు అందరికి తెరుచుకుంటాయని.. ప్రగతి భవన్ ఇక డాక్టర్ అంబేద్కర్ భవన్‌గా మారుతుందని తెలిపారు. ఇకపై అది ప్రగతి భవన్ కాదని.. ప్రజా భవన్ అని తెలిపారు. సీపీఐ, సీపీఎం, టీజేఎస్‌లతో కలిసి ముందుకు వెళ్తామని పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రి పదవికి కేసీఆర్ రాజీనామా.. ఆమోదించిన గవర్నర్



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి పదవికి కేసీఆర్ రాజీనామా చేశారు. ఆదివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భారాస ఓటమి చవిచూసింది. ఈనేపథ్యంలో కేసీఆర్ తన రాజీనామా లేఖను గవర్నర్‌కు పంపారు. కేసీఆర్ రాజీనామాను గవర్నర్ ఆమోదించినట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నర్ సూచించినట్లు సమాచారం.

## ఉప ఎన్నిక తప్పించిన వెంకటరమణా రెడ్డి..



కామారెడ్డి నియోజకవర్గంలో కాటిపల్లి వెంకట రమణా రెడ్డి చరిత్ర సృష్టించారు. బీజేపీ తరఫున పోటీ చేసిన ఆయన సమీప అభ్యర్థులైన సీఎం కేసీఆర్, రేవంత్ రెడ్డిపై 11 వేల తేడాతో విజయం సాధించారు. మొదటి రౌండ్ నుంచి తీవ్ర ఉత్కంఠ నెలకొన్న ఈ నియోజకవర్గం ఫలితంపై యావత్ తెలంగాణ వేచి చూసింది. 10 రౌండ్ల తర్వాత లీడ్ లోకి వచ్చిన బీజేపీ అభ్యర్థి రమణారెడ్డి అనూహ్యంగా విజయం సాధించి చరిత్ర సృష్టించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవంత్ రెడ్డి, సీఎం కేసీఆర్ ను ఓడించిన వ్యక్తిగా ఆయన నిలిచారు.

## టీ-బీజేపీకి మరో బిగ్ షాక్.. కరీంనగర్‌లో బండి సంజయ్ ఓటమి..!



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి ఊహించని షాకులు తగులుతున్నాయి. తప్పక గెలుస్తారనుకున్న కీలక నేతలు ఓటమి పాలు అవుతుండగా.. ఎవరూ ఊహించని స్థానాల్లో అభ్యర్థులు గెలుపొందుతున్నారు. దుబ్బాకలో రఘునందన్ రావు, హుజురాబాద్‌లో ఈటల రాజేందర్, కోరుట్లలో ధర్మపురి అర్వింద్ అర్వింద్ ఓటమి పాలయ్యారు. ఇదిలా ఉండగానే బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సైతం ఓడిపోయారు. కరీంనగర్ లో బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ చేతిలో బండి ఓటమి పాలయ్యారు. స్వల్ప ఓట్ల తేడాతోనే బండి ఓడిపోవడంతో.. రీ కౌంటింగ్ నిర్వహించాలని బీజేపీ నేతలు పట్టుబడుతున్నారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

## ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం.. ఓటమిపై ఈటల



హుజురాబాద్, గజ్వేల్ లో ఓటమిపై బీజేపీ నేత ఈటల రాజేందర్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా తీర్పును గౌరవిస్తున్నా 20 ఏళ్లుగా హుజురాబాద్ ప్రజలు వారికి సేవ చేసే భాగ్యాన్ని కలిగించారు. వారి రుణం తీర్చుకోలేనిది. గెలుపొందిన బీజేపీ అభ్యర్థులకు హార్దిక శుభాకాంక్షలు. ప్రజల సమస్యలను అసెంబ్లీ సాక్షిగా వినిపించాలని కోరుకుంటున్నాను. అధికారం చేపట్టబోతున్న కాంగ్రెస్ పార్టీకి శుభాకాంక్షలు. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు మరియు ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. జై తెలంగాణ !! భారత్ మాతా కీ జై !! అని ట్విట్టర్ ద్వారా ఈటల స్పందించారు.



## ప్రతిపక్ష పార్టీగా సమర్థంగా వ్యవహరిస్తాం: కేటీఆర్

హైదరాబాద్: ప్రతిపక్ష పార్టీగా ప్రజలు ఇచ్చిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా తీర్పును శిరసావహిస్తూ కేసీఆర్ సీఎం పదవికి రాజీనామా చేసినట్టు చెప్పారు.

"పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదు. 119 స్థానాలకు గాను ప్రజలు 39 స్థానాలు ఇచ్చి, ప్రతిపక్ష పాత్ర పోషించమని ఆదేశించారు. ప్రజలు ఇచ్చిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తాం. ప్రభుత్వాన్ని అప్పగించినప్పుడు ఎంత విశ్వాసంగా, విశ్వసనీయత తో సేవలందించామో అదే విధంగా పనిచేస్తాం. ఎదురు దెబ్బను ఒక గుణపాఠంగా తీసుకొని.. పాఠాలు నేర్చుకుంటాం. ఈ 23ఏళ్లలో ఎన్నో ఎదురు దెబ్బలు తగిలాయి. ఎన్నో సందర్భాల్లో ఎత్తులు.. పల్లాలు చూశాం. అనుకున్న లక్ష్యం తెలంగాణ సాధించాం. ప్రజల దయతో రెండు పర్యాయాలు అధికారం చేపట్టాం. చేసిన అభివృద్ధి పట్ల సంతృప్తి ఉంది.

ఈరోజు ఫలితాలు కొంత నిరాశపర్చినా.. బాధలేదు. రాజకీయాల్లో ఇవన్నీ సహజం. నాయకులు, కార్యకర్తల కృషి, పోరాట ఫలితంగానే భారాసకు 39 సీట్లు వచ్చాయి. ప్రతిపక్ష పాత్రలో కూడా అలవోకగా ఇమిడిపోతాం. వందశాతం ప్రజల పక్షాన, ప్రజల గొంతుకగా పనిచేస్తాం. మా పార్టీ శ్రేణులతో పాటు అడుగడుగునా అండగా నిలబడిన, సహకరించిన ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు హృదయపూర్వక ధన్యవాదాలు. రాజకీయాల్లో స్థితప్రజ్ఞత చాలా అవసరం. గెలుపు అయినా, ఓటమి అయినా ఓకేరకంగా తీసుకోవాలని కేసీఆర్ మాకు నేర్పించారు. గతంలో కంటే రెట్టింపు కష్టపడతాం.. కార్యకర్తలు ఎవరూ నిరాశచెందొద్దు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశమిచ్చారు. వారికి కూడా మా అభినందనలు. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ప్రభుత్వాన్ని నడపాలని కోరుకుంటున్నా. ప్రతిపక్ష పార్టీగా మేం నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దు" అని తెలిపారు.

## తెలంగాణ డీజీపీ అంజనీకుమార్ సస్పెండ్..!



అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వేళ తెలంగాణలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. డీజీపీ అంజనీకుమార్ సస్పెండ్ అయ్యారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేంద్ర ఎన్నికల సంఘం డీజీపీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం దిశగా పయనిస్తోన్న నేపథ్యంలో ఆ పార్టీ చీఫ్ రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి డీజీపీ అంజనీ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో డీజీపీ రేవంత్ రెడ్డిని కలవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఈసీ.. డీజీపీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డీజీపీతో పాటుగా రేవంత్ రెడ్డిని కలసిన ఐపీఎస్ అధికారులు మహేష్ భగవత్, సంజయ్ జైన్‌లకు ఈసీ నోటీసులు జారీ చేసింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న వేళ రేవంత్ రెడ్డిని కలవడంపై వివరణ ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. రాష్ట్రంలో ప్రభుత్వ మార్పు వేళ పోలీస్ బాస్‌పై ఈసీ వేటు వేయడం హాట్ టాపిక్‌గా మారింది.